క్లుప్తంగా

కస్టమర్ హైరింగ్ కేంద్రాల పరిశీలన



వీరమల్లిపేటలో యంత్ర పరికరాలను పరిశీలిస్తున్న ఏఓ, తదితరులు

నరుబుజ్జిలి: ప్రభుత్వం రాయితీపై అందించే యంత్ర పరికరాలు రైతులు సక్రమంగా వినియోగించుకోవాలని ఏఓ బొడ్డేపల్లి పద్మనాభం తెలిపారు. కొండవలస, రొట్టవలస, కొత్తకోట, చిగురువలస, వీరమల్లిపేట రైతు సేవా కేంద్రాల్లో రైతుల సౌలభ్యం కోసం ఏర్పాటు చేసిన కస్టమర్ హైరింగ్ కేంద్రాలను మంగళవారం పరిశీలించారు. యంత్ర పరికరాలను అద్దె ప్రాతిపదికన వినియోగించుకోవచ్చన్నారు. ఏఈఓ రాము, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

జిల్లా యూత్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా రౌతు



నియామకపత్రం అందుకుంటున్న సుమతిమోహన్‌రావు

ఎల్.ఎన్.పేట: జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా యూత్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎల్.ఎన్.పేట మండలం దబ్బపాడు గ్రామానికి చెందిన రౌతు సుమతిమోహన్‌రావును నియమించారు. శ్రీకాకుళంలో జరిగిన సంఘం జిల్లా స్థాయి సమావేశంలో తనను నియమిస్తూ ఈ నిర్ణయం తీసుకున్నారని సుమతిమోహన్‌రావు మంగళవారం తెలిపారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లాక వెంగలరావు నియామకపత్రాన్ని అందజేశారు. జిల్లా అధ్యక్షురాలు అమిరుల్లా బేగ్, తదితరులు పాల్గొన్నారు. సంఘం రాష్ట్ర, జిల్లా నాయకులకు సుమతిమోహన్‌రావు కృతజ్ఞతలు తెలిపారు.

రూ.3.50 లక్షల విరాళం



విరాళం అందజేసిన అప్పలరాజు దంపతులు

కొత్తూరు: మండలంలోని గూనభద్ర ఆర్‌ఆర్ కాలనీలో గల భీమలింగేశ్వర స్వామి ఆలయ ధ్వజస్తంభం నిర్మాణానికి తులగాం గ్రామానికి చెందిన గూనాపు అప్పలరాజు, రమాదేవి దంపతులు రూ.3.50 లక్షల విరాళాన్ని మంగళవారం అందించారు. ఈ మొత్తాన్ని తన తండ్రి తవిటినాయుడు జ్ఞాపకార్థం ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు, సర్పంచ్ పెదకోట సాదుబాబుకు అందజేసినట్లు అప్పలరాజు తెలిపారు. అప్పలరాజు దంపతులకు కమిటీ సభ్యులు అభినందించారు. అప్పలరాజు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

వేడుకగా పట్టాభిషేకం



శ్రీరాముని పట్టాభిషేకం చేస్తున్న పండితులు

ఆమదాలవలస: పట్టణంలో ప్రధాన రహదారిలో గల లక్ష్మీ టాకీస్ ఎదురుగా ఉన్న రామ మందిరంలో శ్రీరాముడి పట్టాభిషేకం మంగళవారం వేడుకగా నిర్వహించారు. శ్రీరామ నవమి ఉత్సవాల్లో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహించినట్లు పండితులు తెలిపారు. స్వామివారికి విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. పట్టణ, పరిసర గ్రామాలకు చెందిన భక్తులు పాల్గొన్నారు.

బియ్యం పంపిణీ చేయలేదని ఫిర్యాదు




తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎంపీపీ సావిత్రి, గిరిజనులు

కొత్తూరు: మండలంలోని గూనభద్ర పంచాయతీ పరిధి కంఠమానుగూడకు చెందిన గిరిజనులకు ఏప్రిల్ నెలకు సంబంధించిన బియ్యాన్ని ఇంతవరకు పంపిణీ చేయలేదని తహసీల్దార్ రవిచంద్రకు ఎంపీపీ సవర సావిత్రి, వైఎస్సార్‌సీపీ నాయకుడు సవర రమేష్ మంగళవారం ఫిర్యాదు చేశారు. బియ్యం పంపిణీ చేయాలని పలుమార్లు ఎండీఎం ఆపరేటర్, డీలర్‌కు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. రేషన్ కార్డుదారులు వేలిముద్రలు ముందుగా వేస్తే.. ఆ తరువాత బియ్యం పంపిణీ చేస్తామని ఆపరేటర్, డీలర్ చెప్పినట్లు వినతిపత్రంలో పేర్కొన్నారు. రెండు రోజుల్లో బియ్యం పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకుంటానని తహసీల్దార్ హామీ ఇచ్చారు.

అందని భరోసా..!

- ఆటో, ట్రిప్పర్, టాక్సీ డ్రైవర్లకు ఏటా రూ.15 వేలు అందిస్తామని కూటమి హామీ
- అధికారం చేపట్టి 11 నెలలు అవుతున్నా.. పట్టించుకోని వైనం





రాతికర్ర చెరువు వద్ద ఉన్న ఆటో స్టాండ్

నరసన్నపేట: ఎన్నిలకు ముందు ఒక మాట.. తరువాత మరో మాట చెప్పడం.. ఇచ్చిన హామీలను ఎగ్గొట్టడం టీడీపీ నాయకులకు వెన్నతో పెట్టిన విద్య. అధికారమే ఆశగా అన్ని వర్గాలకు ఇష్టానుసారంగా హామీలు ఇవ్వడం, అధికారం వచ్చిన తరువాత వాటిని అటకెక్కించడం సీఎం చంద్రబాబుకి పరిపాటిగా మారింది. ప్రజలను పదే, పదే మోసం చేయడంలో అయనకు అయనే సాటి అని ప్రతిసారీ నిరూపించుకుంటూ వస్తున్నారు. 2014లో ఆరు వందలకు పైగా హామీలు ఇచ్చి, మాయ మాటలు చెప్పి తప్పించుకున్న విషయం తెలిసిందే. 2024లో కూడా అదే రీతిలో హామీలు ఇచ్చారు. అధికారం చేపట్టాక కుంటుసాకులు వెతుకుతూ ఎగ్గొట్టే ప్రయత్నాలు చేస్తున్నారు. నమ్మిన ప్రజలను పూర్తిగా మోసం చేస్తున్నారు. హామీలు అమలుకు కనీస చర్యలు తీసుకోవడం లేదు. పలు వర్గాల ప్రజలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇదేం తీరని మండిపడుతున్నారు.

పెరిగిన అపరాధ రుసుం..

కూటమి ప్రభుత్వం సహాయం చేయకపోగా.. వివిధ రకాల పేర్లతో అపరాధ రుసుం విధిస్తూ తమపై ఆర్థికభారం మోపుతుందని డ్రైవర్లు మండిపడుతున్నారు. వెహికల్ ఫిట్‌నెస్ చార్జీలు రూ.1,800 నుంచి రూ.3500లకు పెంచింది. గతంలో టెక్కలిలో ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు అయ్యేవి, ఇప్పుడు శ్రీకాకుళం వెళ్లాల్సి వస్తోంది. ప్రయాణికులు ఏమాత్రం అధికంగా ఉన్నా కేసులు పెడుతున్నారు.

ఆటోడ్రైవర్లకు భరోసా ఏదీ..

డ్రైవర్ సాధికార సంస్థ ఏర్పాటు చేసి ప్రమాద బీమా, హెల్త్ ఇన్సూరెన్స్, విద్యా రుణాలు వంటి సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తామని కూటమి నాయకులు ఎన్నికల సమయంలో ఊదరగొట్టారు. డ్రైవర్లను ఓనర్లు చేసే లక్ష్యంతో వాహన కొనుగోళ్లకు రూ.4 లక్షల వరకు పొందే రుణాలపై 5 శాతం పైగా వడ్డీ సబ్సిడీ.. బ్యాడ్జీ కలిగిన ప్రతి ఆటో డ్రైవర్‌కూ, టాక్సీ, హెవీ లైసెన్స్ కలిగిన ప్రతి లారీ, ట్రిప్పర్ డ్రైవర్‌కు ఏటా రూ.15 వేల ఆర్థిక సహాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ మేరకు మేనిఫెస్టోలో పెద్ద, పెద్ద అక్షరాలతో పొందుపరిచారు. వీటిలో ఏ ఒక్క హామీ ఇప్పటికీ కార్యరూపం దాల్చలేదు. 2025–26 వార్షిక బడ్జెట్‌లో కూడా ఆటో డ్రైవర్ల ఆర్థిక సహాయానికి సంబంధించి ఎటువంటి నిధులూ కేటాయించలేదు. సంక్షేమ బోర్డు, ఇతర హామీలను పరిగణలోకి తీసుకోలేదు. ఇచ్చిన మాట ప్రకారం ఏడాదికి రూ.15 వేల ఆర్థిక సహాయం ఇవ్వాల్సిందేనని ఆటో, లారీ, ట్రిప్పర్ డ్రైవర్లు డిమాండ్ చేస్తున్నారు.

గతంలో ఠంచన్‌గా ..

మాజీ సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో 2019 నుంచి 2024 వరకు వాహన మిత్ర పథకం ద్వారా ఏటా రూ.10 వేల ఆర్థిక భరోసా ఠంచన్‌గా అందించేవారు. ఈ మొత్తం వాహనాల మరమ్మతులతోపాటు ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు పొందడానికి సరిపడేది. నరసన్నపేట నియోజకవర్గంలో ఏటా 3,200 మందికి వాహన మిత్ర ద్వారా ఆర్థిక సహాయం అందేది.

ఇచ్చిన హామీ అమలు చేయాలి



ఎన్నికల సమయంలో కూటమి నాయకులు రూ.15 వేల ఆర్థిక సహాయం చేస్తామని హామీ ఇచ్చారు. దీనిని నమ్మి ఓటు వేశాం. ఇంతవరకు ఈ పథకం గురించి ఎటువంటి ప్రకటనా రాలేదు. వెంటనే ప్రభుత్వం స్పందించి ఇచ్చిన హామీ ప్రకారం ఆటో డ్రైవర్లకు ఖాతాల్లో డబ్బులు జమచేయాలి. పెరిగిన అపరాధ రుసుం నుంచి ఉపసమనం కల్పించాలి.

– పాగోటి వాసుదేవరావు, ఆటో డ్రైవర్, తామరాపల్లి, నరసన్నపేట మండలం

నమ్మకంతో ఓటు వేశాం



గత ప్రభుత్వ హయాంలో నాలుగేళ్లలో రూ.40 వేలు వచ్చాయి. కూటమి ప్రభుత్వం ఏటా రూ.15 వేలు ఇస్తామంటే నమ్మకంతో ఓటు వేశాం. ఇప్పటివరకు ఆటో డ్రైవర్లకు ఎటువంటి ఆర్థిక సహాయం అందలేదు. ఇచ్చిన హామీ మేరకు ఆర్థిక సహాయం అందజేయాలి.

– జి.చిన్నారావు, ఆటో డ్రైవర్, నరసన్నపేట

తాగునీటి సమస్య పరిష్కరించాలని వినతి



ఐటీడీఏ పీఓకు వినతిపత్రం అందజేస్తున్న రెడ్డి శాంతి, తదితరులు

కొత్తూరు: పాతపట్నం నియోజకవర్గం పరిధిలోని గిరిజన గ్రామాల్లో గల తాగునీటి ఎద్దడిని పరిష్కరించాలని సీతంపేట ఐటీడీఏలో పీఓ యశ్వంత్ కుమార్ రెడ్డికి మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఎండలు అధికంగా ఉండటం వల్ల పలు గిరిజన గ్రామాల్లో నీటి ఎద్దడి తీవ్రంగా ఉందన్నారు. రోడ్లు అధ్వానంగా ఉన్నందున గిరిజనులు అవస్థలు పడుతున్నారన్నారు. గిరిజన గ్రామాల్లో రోడ్లను బాగు చేయించాలన్నారు.

కొత్తూరు మండలంలోని కంఠమానుగూడలో గిరిజనులకు రేషన్ దుకాణం ద్వారా ఈ నెలకు చెందిన బియ్యం ఇంతవరకు అందివ్వలేదన్నారు. రేషన్ సరుకులు వెంటనే పంపిణీ అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో కొత్తూరు ఎంపీపీ సవర సావిత్రి, వైఎస్సార్‌సీపీ నాయకుడు సవర రమేష్, పలువురు గిరిజన మహిళలు, యువకులు ఉన్నారు.

బిందు తీర్థం అభివృద్ధికి చర్యలు తీసుకోవాలి



కలెక్టర్‌కు చిత్రపటం అందజేస్తున్న ఎంపీపీ గోపి, తదితరులు

జలుమూరు: మండలంలోని ప్రసిద్ధ శైవక్షేత్రం శ్రీముఖలింగంలో ఉన్న అష్ట తీర్థాల్లో ఒకటైన బిందు తీర్థం అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్‌ను ఎంపీపీ వాన గోపి కోరారు. మంగళవారం కలెక్టరేట్‌కు వెళ్లి వినతిపత్రం అందించారు. రెండెకరాలకు పైబడి విస్తీరణం గల ఈ తీర్థం ఎంతో చరిత్రాత్మకమైందన్నారు. మిగిలిన తీర్థాలకు కూడా ఎంతో విశిష్టత, చరిత్ర ఉందన్నారు. ప్రస్తుతం బిందు తీర్థం చాలావరకు ఆక్రమణలకు గురైందన్నారు. తీర్థాల అభివృద్ధికి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం గ్రామానికి చెందిన బి.మహేష్ గీచిన కలెక్టర్ చిత్రపటాన్ని బహుమతిగా అందించారు. ఎంపీటీసీ సభ్యుడు కె.హరిప్రసాద్, అర్చకులు, తదితరులు పాల్గొన్నారు.

భూ ఆక్రమణ పరిశీలన



ఆక్రమణకు గురైన భూమిని పరిశీలిస్తున్న రెవెన్యూ అధికారులు

హిరమండలం: మండలంలోని బ్యారేజ్ సెంటర్, సంతోషిమాత ఆలయం సమీపంలోని ప్రభుత్వ భూమి సుమారు 50 సెంట్లు అక్రమణకు గురైంది. రెవెన్యూ సిబ్బంది, ఆర్ఐ ఉమాశంకర్ ఆధ్వర్యంలో ఆక్రమణకు గురైన స్థలాన్ని మంగళవారం పరిశీలించారు. ఆర్ఐ మాట్లాడుతూ ఎవరో గుర్తుతెలియని వ్యక్తులు రెండు రోజుల క్రితం ఈ స్థలాన్ని ఆక్రమించారని, ఈ స్థలంలో ఉద్యానం ప్రాజెక్టు–2కు కేటాయించడం జరిగిందన్నారు. ప్రభుత్వ భూమిని ఎవరైనా ఆక్రమిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు.

ఈ నీరు సురక్షితమేనా?



ఈ చిత్రంలో కనిపిస్తున్న గ్రామీణ రక్షిత మంచి నీటి పథకం సరుబుజ్జిలి మండలం పాలవలస పంచాయతీ పరిధిలోని చినవెంకటాపురం గ్రామంలో ఉంది. ఈ ట్యాంక్‌ను నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం శుభ్రం చేయకపోవడం వలన నీటినాణ్యతపై ప్రజలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఇదే నీటిని తాగడం వలన అంటువ్యాధులు ప్రబలే ప్రమాదముందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే అధికారులు స్పందించి ట్యాంకును శుభ్రం చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

– సరుబుజ్జిలి

అన్న సమారాధన



బూర్జ మండల కేంద్రంలోని రామాలయంలో శ్రీరామ నవమి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం అన్న సమారాధన ఏర్పాటు చేశారు. బూర్జతోపాటు చుట్టు పక్కల గ్రామాలకు చెందిన భక్తులు పెద్ద ఎత్తున హాజరై తీర్థప్రసాదాలు స్వీకరించారు. గ్రామ పెద్దలు, కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

– బూర్జ

పేరుకుపోయిన గుర్రపుడెక్క



ఈ చిత్రం సరుబుజ్జిలి మండలం గోనెపాడు సమీపంలో వంశధార కుడి ప్రధాన కాలువలో పేరుకుపోయిన గుర్రపుడెక్క. మరికొద్ది నెలల్లో ఖరీఫ్ సీజన్ ప్రారంభం కానుంది. కాలువల్లో షట్టర్లు, చెక్ డ్యామ్‌లు కూడా ఎక్కడికక్కడ శిథిలావస్థకు చేరుకున్నాయి. కాలువల నిండా పూడికలు పేరుకుపోయాయి. అధికారులు స్పందించి ఖరీఫ్ సీజన్ ప్రారంభం కాకముందే కాలువల అభివృద్ధి పనులు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

– సరుబుజ్జిలి

కాలువ ఇలా .. సాగునీరు ఎలా?



బూర్జ మండలంలోని నామాల లక్ష్మీపురం వద్ద తుప్పలు, పూడికలతో ఓనిగెడ్డ పిల్ల కాలువ నిండిపోయింది. ఓనిగెడ్డ రిజర్వాయర్ పరిధిలోని పిల్ల కాలువలో తుప్పలు పేరుకుపోయాయి. ఓనిగెడ్డ నుంచి సింగన్నపాలెం వరకు ఉన్న పిల్ల కాలువ పూర్తిగా పూడికతో నిండిపోయింది. కాలువ ఇలా ఉంటే రానున్న ఖరీఫ్‌లో శివారు పొలాలకు సాగునీరు ఎలా అందుతుందని సింగన్నపాలెం, నామాల లక్ష్మీపురం, అన్నంపేట, అయ్యవారిపేటతో పలు గ్రామాల రైతులు ఆందోళన చెందుతున్నారు.

– బూర్జ

మున్సిపల్ కార్మికుల నిరసన



మున్సిపల్ మేనేజర్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులు

ఆమదాలవలస: మున్సిపల్ కాంట్రాక్ట్ పారిశుద్ధ్య కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించకపోతే నిరవధిక సమ్మెకు దిగుతామని మున్సిపల్ కాంట్రాక్ట్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ నాయకుడు తాడి సంతోష్ కూటమి ప్రభుత్వాన్ని హెచ్చరించారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ఎదుట తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మంగళవారం నిరసన చేపట్టారు. మున్సిపల్ మేనేజర్ లక్ష్మీనారాయణ బిషోయ్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంతోష్ మాట్లాడుతూ సీఐటీయూ నాయకత్వం పిలుపు మేరకు ఈ నెల16, 17వ తేదీల్లోనూ నిరసన కార్యక్రమాలు చేపడతామన్నారు. ఉద్యోగ విరమణ చేసిన, విధులు నిర్వహిస్తూ అనారోగ్యంతో మృతి చెందినవారి స్థానాల్లో వారి కుటుంబ సభ్యులకు అవకాశాలు కల్పించాలని కోరారు. కార్మికుల రిటైర్మెంట్ వయస్సును 62 ఏళ్లకు పెంచాలని, గ్రాట్యూటీ, ఇతర బెనిఫిట్స్‌ను కల్పించాలని డిమాండ్ చేశారు. యూనియన్ నాయకులు కె.తారకేశ్వరరావు, ఎ.శ్రీనివాస్, కె.ఈశ్వరరావు, డి.రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి నిధులతో మొక్కల పెంపకం



నర్సరీలో మొక్కలు పెంపకాన్ని పరిశీలిస్తున్న పీడీ సుధాకర్

నరసన్నపేట: ఉపాధి నిధులతో మొక్కలు పెంచుతున్నామని, వీటిని రైతులకు పంపిణీ చేస్తామని డీఆర్‌డీఏ పీడీ బి.సుధాకర్ అన్నారు. మండలంలోని సామాజిక అటవీశాఖ రేంజ్ కార్యాలయ పరిధిలోని తామరాపల్లి నర్సరీలో మొక్కలను పెంపకాన్ని మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పెంపకానికి అనువుగా ఉండే మొక్కలను సిద్ధం చేస్తున్నామన్నారు. తామరాపల్లిలో లక్ష మొక్కలను పెంచుతున్నట్లు తెలిపారు. అనంతరం తామరాపల్లిలో చేపడుతున్న ఉపాధి పనులను పరిశీలించారు. నిబంధనల మేరకు పని చేయాలని, ఒక్క రోజు వేతనం రూ.307 పొందేలా పని చేయాలన్నారు. రేంజ్ ఆఫీసర్ జగదీశ్వరరావు, ఉపాధి ఏపీఓ యుగంధర్, తదితరులు పాల్గొన్నారు.

నేడు మండల సమావేశం

ఆమదాలవలస: ఈ నెల 16వ తేదీన స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ తమ్మినేని శారదమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నారు. ఈ మేరకు ఎంపీడీఓ రోణంకి వెంకటరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశం ఉదయం 10:30 గంటలకు ప్రారంభమవుతుందన్నారు. సంబంధిత అధికారులు సమగ్ర సమాచారంతో విధిగా హాజరుకావాలన్నారు. ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొనాలని కోరారు.

చిరుజల్లులు..

ఎల్.ఎన్.పేట: మండలంలోని పలు ప్రాంతాల్లో మంగళవారం ఒక మోస్తారుగా వర్షం కురిసింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు వేసవి ఎండ తీవ్రత చూపింది. సాయంత్రం వాతావరణం ఒక్కసారిగా చల్లగా మారిపోయింది. తేలికపాటి జల్లులు కురిశాయి. వర్షంతో ఇటుకల తయారీదారులు అనేక ఇబ్బందులు పడ్డారు. మండలంలోని వంశధార నదీ తీరంలో ఉన్న లక్ష్మీనర్సుపేట, వాడవలస, మిరియాపల్లి, బసవరాజుపేట, దబ్బపాడు తదితర గ్రామాల్లో వాణిజ్య పంటలకు వర్షం ఎంతో మేలు చేసిందని ఆయా గ్రామాల రైతులు తెలిపారు.



ఎల్.ఎన్.పేట: తురకపేట ప్రాంతంలో కురుస్తున్న వర్షం

సారవకోట మండలంలో..

సారవకోట: మండల కేంద్రంతోపాటు చుట్టు పక్కల గ్రామాల్లో మంగళవారం తేలికపాటి వర్షం కురవడంతో వాతావరణం చల్లబడింది. రబీ ధాన్యాన్ని రోడ్లపై ఆరబెట్టిన రైతులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ధాన్యం రాశులు, బస్తాలపై టార్పాలిన్లు కప్పారు. ఈదురుగాలులకు పలుచోట్ల మామిడి కాయలు నేలరాలాయి.



సారవకోట: ధాన్యం కుప్పపై కప్పిన టార్పాలిన్

రెడ్డి శాంతికి అభినందనలు



రెడ్డి శాంతికి అభినందనలు తెలియజేస్తున్న దుంపల రామారావు, నాయకులు

పాతపట్నం: వైఎస్సార్‌సీపీ రాష్ట్ర క్రమ శిక్షణ కమిటీ సభ్యురాలిగా ఇటీవల నియామకమైన పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతిని పలువురు నాయకులు మంగళవారం అభినందించారు. పాతపట్నంలోని ఆమె క్యాంప్ కార్యాలయంలో పార్టీ రాష్ట్ర కాళింగ కుల చైర్మన్ దుంపల రామారావు (లక్ష్మణరావు), మండల కోఆప్షన్ సభ్యుడు మాధవ్ పుల్లార్, జిల్లా సెక్రటరీ అమర రమణ, తదితరులు కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. పార్టీ నాయకులు తిర్లంగి లోకనాథం, బొడ్డెపల్లి నాగేశ్వరావు, తిర్లంగి రామ్మోహన్ ఉన్నారు.

కరెన్సీ నోట్లపై అంబేడ్కర్ చిత్రం ముద్రించాలి

సారవకోట: కరెన్సీ నోట్లపై అంబేడ్కర్ చిత్రం ముద్రించాలని నరసన్నపేట నియోజకవర్గ బీఎస్పీ ఇన్‌చార్జి కె.నీలకంఠం కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం ఆయన సారవకోటలో విలేకర్లతో మాట్లాడారు. దేశంలో రూపాయికి ఉన్న వినిమయ విలువ తెలిపి, రిజర్వ్ బ్యాంకు స్థాపనకు మార్గదర్శకాలు అందజేసిన అంబేడ్కర్ బొమ్మ కరెన్సీ నోట్లు, నాణేలపై ముద్రించాలన్నారు.

జయప్రదం చేయండి



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఏఐవైఎఫ్ ప్రతినిధులు

పాతపట్నం: తిరుపతిలో మే 15 నుంచి 18వ తేదీ వరకు జరగనున్న ఏఐవైఎఫ్ 17వ జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సంతోష్, శ్రీనివాస్ పిలుపునిచ్చారు. పాతపట్నం రైల్వే స్టేషన్ వద్ద మంగళవారం పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యువతను అన్ని రకాలుగా మోసం చేస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఉద్యమించడానికి మహాసభలు వేదిక కానున్నాయన్నారు. అధికారంలోకి వస్తే ప్రతీ సంవత్సరం రెండు కోట్ల ఉద్యోగాలను నియమిస్తామని బీజేపీ ప్రభుత్వం హామీ ఇచ్చిందని, మూడోసారి అధికారంలోకి వచ్చినప్పటికే ఆ హామీని అమలు చేయలేదన్నారు. ఏఐవైఎఫ్ మాజీ జిల్లా కార్యదర్శి లండ వెంకటరావు, తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఎస్ఎస్‌తో 90 శాతం ఆడ దూడల జననం



దూడను పరిశీలిస్తున్న సీఈఓ శ్రీనివాసరావు

పొందూరు: లింగ నిర్ధారణ వీర్యం (సెక్స్ సార్టెడ్ సెమెన్)తో కృత్రిమ గర్భోత్పత్తి విధానంలో 90 శాతం ఆడ దూడలు పుడతాయని ఏపీ పశుగణాభివృద్ధి సంస్థ ముఖ్య కార్యనిర్వాహణాధికారి డాక్టర్ ఎం.శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని తోలాపి గ్రామంలో లింగ నిర్ధారిత వీర్యం ద్వారా జన్మించిన దూడలను మంగళవారం పరిశీలించారు. రాబోయే రోజుల్లో ఈ విధానానికి ప్రభుత్వ ప్రోత్సాహం ఉంటుందన్నారు. శ్రీకాకుళం డివిజన్ డిప్యూటీ డైరెక్టర్ రామ్మోహన్‌రావు, ఈఓ సత్యప్రకాష్, విజయనగరం డిప్యూటీ డైరెక్టర్ దామోదరరావు, పొందూరు ఏడీ బాలకృష్ణ, వైద్యులు పద్మావతి, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఫైర్ సిబ్బంది

కొత్తూరు: అగ్ని మాపక వారోత్సవాల సందర్భంగా మండల కేంద్రంలోని ప్రజలకు అగ్ని ప్రమాదాల నివారణపై స్థానిక అగ్నిమాపక అధికారి బుచ్చోడు ఆధ్వర్యంలో మంగళవారం అవగాహన కల్పించారు. అగ్ని ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన పలు జాగ్రత్తలను వివరించే కరపత్రాలను ప్రయాణీకులకు, షాపుల నిర్వాహకులకు పంపిణీ చేశారు. బహుళ అంతస్తుల్లో అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు మంటలను ఎలా అదుపు చేయాలో మాక్ డ్రిల్ నిర్వహించారు.

ఉపాధి పనుల పరిశీలన

పొందూరు: మండలంలోని మలకాం గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఏపీఓ శ్రీనివాసరావు మంగళవారం పరిశీలించారు. కూర్మాపు చెరువులో రూ.9 లక్షలతో ఫిష్ పాండ్ పనులు చేపడుతున్నారు.

రూ.10 వేల ఆర్థికసాయం



అప్పారావుకు నగదు అందజేస్తున్న మైత్రీ ఫౌండేషన్ ప్రతినిధులు

జలుమూరు: మండలంలోని చల్లవానిపేటకు చెందిన బొమ్మాళి అప్పారావు పక్షవాతంతో బాధపడుతున్నారు. ఆయనకు అదే గ్రామానికి చెందిన మైత్రీ ఫౌండేషన్ ప్రతినిధులు మంగళవారం రూ.10 వేలు అందించారు. ఇలా ప్రతి నెలా ఒకరు చొప్పున ఆర్థికసాయం అందించేందుకు తీర్మానించినట్లు ఫౌండేషన్ ప్రతినిధులు మెండ రామారావు, మెండ చిట్టిబాబు, తదితరులు పాల్గొన్నారు.